
ప్రజాశక్తి

శనివారం 1 మార్చి 2025



రామతీర్థం ఆలయానికి రూ.49.96 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామతీర్థంలోని రామ స్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా రూ. ఆదాయం 49లక్షల, 96వేల 162రూపాయలు ఆదాయం వచ్చింది. శుక్రవారం దేవస్థానం ఆవరణలో ధర్మ హుండీలను లెక్కించారు. నగదు రు.49,96,162, బంగారం 11 గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 5 కేజీల 960 గ్రాములు వచ్చింది. దేవాదాయ శాఖ జిల్లా కమిషనర్ కె. శిరీష పర్యవేక్షణలో తనిఖీ దారు జి. శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీనివాస్, సిబ్బంది హుండీలను లెక్కించారు.

సంక్షేమ పథకాలు ఎగ్గొట్టే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా కోతలు బడ్జెట్. సంక్షేమ పథకాలకు కేటాయించాల్సిన నిధుల్లో కోతలు పెట్టి, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టారు. విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద కేటాయింపుల్లోనూ కోత పెట్టారు. 18ఏళ్ల దాటిన మహిళలకు ఇస్తామన్న రూ.1500 కు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిధులకు ఆదాయ వనరులు ఎలా వస్తాయో చెప్పలేదు. కేవలం మాటలు తప్ప చేతలు ప్రభుత్వం కాదు అనడానికి ఈ బడ్జెటే నిదర్శనం. ఉత్తరాంధ్రకు ఈ బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేశారు.

- మజ్జి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు


రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది



రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉంది. రాష్ట్రం పూర్తి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రూ.3,22,359 కోట్లు కేటాయించి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసింది. సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలుకు సమ ప్రాధాన్యం ఇచ్చింది. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది.వ్యవసాయ, అనుబంధ రంగాలకు నిధులు కేటాయించడం ద్వారా రైతాంగానికి వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం నిలిచింది.

- కిమిడి నాగార్జున, టిడిపి జిల్లా అధ్యక్షులు

అదే నిర్లక్ష్యం



- సాగునీటి ప్రాజెక్టులకు కంటితుడుపు కేటాయింపులు
- నిరుద్యోగులకు నిరాశ
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు లేని ఉద్యోగ భద్రత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపై మునుపటి మాదిరిగానే నిర్లక్ష్యం, వివక్ష కొనసాగింది. వ్యవసాయం, ఉద్యాన పంటలు, వాటి అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తామంటూనే అందుకు అవసరమైన నీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యపు వరదను పారించింది. నిరుద్యోగులను నిరాశ పర్చింది. కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను తీవ్ర అభద్రతా భావంలోకి నెట్టింది. వీటన్నింటికి మించి విజన్ స్వర్ణాంధ్ర సాధనకు అనుగుణంగానూ నిధులు కేటాయింపు కనిపించలేదు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసన సభలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీన్ని ఉమ్మడి విజయ నగరానికి చెందిన టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు గొప్పగా చెప్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లా అభివృద్ధికి గాని, సంక్షేమానికి గాని తోడ్పాటు నందించే బడ్జెట్ కేటాయింపులు లేకపోవడమే ఇందుకు కారణం. ఈ రెండు జిల్లాలూ పూర్తిగా వ్యవసాయాధారిత మైనవి. ఈ నేపథ్యంలో సాగునీటి వనరుల అభివృద్ధి అత్యంత కీలకం అన్న ప్రతి ఎన్నికల్లోనూ అధికార ప్రతిపక్ష పార్టీలు పదేపదే చెప్తున్నవే. కానీ, అందుకు అనుగుణంగా కేటాయింపులు లేవు. అయితే జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేసినట్లు వ్యవసాయశాఖా మంత్రి ప్రకటించారు.

తోటపల్లికి కంటితుడుపు కేటాయింపు

64వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే, కుడి కాలువ ద్వారా విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఇప్పటికీ సగం విస్తీర్ణానికే నీరందిస్తోంది. ఏటా అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకపోవడమే కారణం. నిర్మాణ పనులు, భూసేకరణ, నష్టపరిహారం కోసం ఈ ఏడాది రూ.519.1119కోట్లు కేటాయించాలని ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా, ఆచరణలో ప్రభుత్వం రూ.47.81కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. గత ఏడాది కాలువల నిర్మాణాలు, ఇతర పనుల కోసం రూ.279.96 కోట్లు, భూసేకరణకు రూ.55.81 కోట్లు, నష్ట పరిహారం, పునరావాసం కోసం రూ.119.10 కోట్లు, సిఎడిడబ్ల్యుఎంకు రూ.110.06 కోట్లు, నిర్వహణకు రూ.65 లక్షలు.. చొప్పున మొత్తం రూ.565.58 కోట్లు అవసరం కానున్నట్టు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే, కేవలం రూ.36.85 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో ఖర్చుచేసింది కేవలం రూ.56లక్షలే.

రామతీర్థసాగర్‌పై అంతులేని నిర్లక్ష్యం

రామతీర్థసాగర్ పనులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ముందుకు సాగడం లేదు. 24వేల ఎకరాలకు సాగునీరు, విజయ నగరానికి తాగునీరు, ఇటీవల భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు నీటి సదుపాయం కోసం లక్ష్యంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.807.55 కోట్లు అవసరం కానున్నట్టు ప్రతిపాదనలు పంపగా రూ.68కోట్లు మాత్రమే కేటాయించింది. గత ఏడాది రూ.533.18 కోట్లు కోరగా, రూ.28 కోట్లు మాత్రమే కేటాయించి ఆచరణలో రూ.18కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. దీంతో, ఇప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రారంభం కూడా ప్రభుత్వం చెప్తున్న వచ్చే ఏడాదిలో అందుబాటుకి రాబోదని మరోసారి స్పష్టమైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కూడా తగినంతగా నిధులు కేటయించలేదు. పెదంకలాం, మడ్డువలస జలాశయాలకు కంటితుడుపుగా నిధులు కేటాయించారు. జంఝావతి, పెద్దగెడ్డ, ఆంధ్ర, ఒట్టిగెడ్డలకు పూర్తిగా నిధులు కేటాయించలేదు.

సంక్షేమమూ సగం సగమే

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు కేటాయింపులు చూపినప్పటికీ ఆ నిధులు అర్హులందరికీ సరిపోయే పరిస్థితి లేదని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి నిబంధనల పేరుతో వడపోతకు దిగజారే ప్రమాదం లేకపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో కుటమి పార్టీలు పదేపదే చెప్పిన నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. దీంతో, మెగా డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు, గ్రూప్ -2 అభ్యర్థులకు మరింత నిరాశకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆప్కాస్‌ను రద్దుచేసి, తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతిని పునరుద్ధరించేందుకు నిర్ణయించడం ఉద్యోగులు, కార్మికుల్లో అభద్రతా భావానికి దారితీసింది. తల్లికి వందనం కేటాయించాల్సిన నిధులు తగ్గించడంతో విద్యార్థుల వడపోత చేపట్టనున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. నెలకు రూ.1500 ఇచ్చే మహాశక్తి పథకాన్ని మాయం చేశారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా నిరుద్యోగులను మోసం చేశారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి మసి పూసి మారేడు కాయ చేశారు.

రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పూర్తిగా పేదలు, రైతుల వ్యతిరేక బడ్జెట్. బడ్జెట్ బుక్‌లో సగం వరకు ప్రభుత్వ విధానాలు, సూక్తులే ఉన్నాయి. ఇది అంకెల గారడి, ఉత్తుత్తి బడ్జెట్. కేటాయింపులు తప్ప ఖర్చు చేసింది ఏమీ లేదు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం కోసం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. ఉత్తరాంధ్రలో అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులు తగిన నిధుల కుటాయింపులు లేవు. రెవెన్యూ లోటు ఎలా పూడ్చుకుంటారో చెప్పలేదు. రాష్ట్ర ప్రజలకు అన్యాయానికి గురి చేసే బడ్జెట్. ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ కాదు.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

సంఖ్య ఘనం.. కేటాయింపు శూన్యం



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంఖ్యలు ఘనంగా ఉన్నా వాస్తవ కేటాయింపులు శూన్యమనే చెప్పాలి. అంతా అంకెల గారడి - అభూత కల్పనగా ఉంది. దశ - దిశ లేని.. పస లేని బడ్జెట్ ఇది. రాష్ట్రం గుల్ల.. బడ్జెట్ అంతా డొల్ల. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ఇది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని తొలి బడ్జెట్‌తోనే నిరూపితం అయ్యింది. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడం అరకొరనే. తల్లికి వందనం పథకానికి నిధుల్లో కోత పెట్టారు.

- ఎం.విద్యాసాగర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

ఇది డొల్ల బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంత డొల్లమయంగా ఉంది. జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదు. సూపర్ సిక్స్ లో పేర్కొన్న నిరుద్యోగ భృతి గాని, 18ఏళ్ల నిండిన మహిళలకు రూ.15వందలు విషయం గాని, ఉచిత బస్సు వంటి విషయాల ప్రస్తావన లేదు. జిల్లా సమగ్ర అభివృద్ధికి, జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు గాని ఎటువంటి సమగ్ర ప్రణాళికలు లేవు. జిల్లా అభివృద్ధి కోసం నిధుల కేటాయింపుపై ఉమ్మడి జిల్లాలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలి.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

ప్రజామోదమైన బడ్జెట్




రాష్ట్ర బడ్జెట్ ప్రజామోదంగా ఉంది. గత వైసిపి హయాంలో పెట్టిన బడ్జెట్ కొందరికి మాత్రమే లాభదాయకంగా ఉండేది. కానీ నేడు వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారు. సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. చ్చేరన్నారు. ప్రధానంగా అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డ సూపర్ సిక్స్ పథకాలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం అభినందనీయం.ఆర్థిక లోటు ఉన్నా కూడా సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పోలవరం, అమరావతికి భారీ కేటాయింపులు చేయడం హర్షనీయం.

- గురాన అయ్యలు, జనసేన నాయకులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

66 కేంద్రాల్లో నిర్వహణ ● ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐఒ ఆదినారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 1 తేదీ (శనివారం) నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు పరీక్షను ప్రశాంత వాతావరణంలో రాసుకునే విధంగా ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 66 కేంద్రాల్లో 177 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం 20,902 మంది, ద్వితీయ సంవత్సరం 20,368 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి.

ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. 66 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు 1250 మంది సిబ్బందిని అధికారులు నియమించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5 సిటింగ్ స్క్వాడ్‌లు, ఒక హై పవర్ కమిటీని నియమించారు. పరీక్షల విధులు నిర్వహించే ఉద్యోగులెవరూ సెల్ ఫోన్,ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించడానికి అనుమతి లేదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్తు లైట్లు వంటి సదుపాయాలు కల్పించారు. పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసారు. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వం విద్యార్థి ఫోన్ నెంబర్‌కు హాల్ టికెట్‌లను వాట్సాప్ ద్వారా పంపింది. విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నెంబర్‌లో హాల్ టికెట్స్ తీసుకునే అవకాశం కల్పించింది. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఆర్టీసి,విద్యుత్,పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సహకారం సుకున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులు సైతం ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు,సెల్ ఫోన్లను పరీక్ష హాలులోకి అనుమతించబోమని అధికారులు తెలిపారు. కేవలం పెన్, అట్ట, హాల్ టికెట్ మాత్రమే తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

ఇంటర్ పరీక్షలు 66 కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రవాణా, పరీక్ష కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకొని రావొద్దు.

-ఎం.ఆదినారాయణ, ఆర్ఐఒ

మానాపురం ఆర్ఒబి పనులు వేగవంతం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మానాపురం రైలు ఓవర్ బ్రిడ్జిను ఏప్రిల్ నాటికి ప్రారంభం అయ్యేలా పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఛాంబర్ లో నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లతో ఆర్‌ఒబి పనులపై కలెక్టర్ సమీక్షించారు. గత శుక్రవారం వరకు 81 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ శుక్రవారానికి 82.06 శాతం పూర్తయ్యాయని, నెమ్మదిగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. మార్చి లోపల మిగిలిన 18 శాతం పూర్తి చేసి ఏప్రిల్ 1 నాటికి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. 2021 లో పనులు ప్రారంభం అయ్యాయని, 2023 జనవరి నాటికే పూర్తి చెయ్యవలసి ఉందని, ఇప్పటికే ఆలస్యం అయ్యిందని తెలిపారు. మార్చి 1 నుండి 31 వరకు వారం వారం లక్ష్యాలను నిర్దేశించాలని, ప్రాధాన్యత వారీగా పనులు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను తయారు చెయ్యాలని ఆర్అండ్‌బి ఎస్ఇకి ఆదేశించారు. మార్చి 31 నాటికి పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. గుంతలు లేని రహదారుల నిర్మాణంలో భాగంగా మొదటి దశ కింద రెండవ, మూడవ దశలలో మంజూరైన 100 పనులకు గానూ 15 పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, డిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



కార్మికులను లోపలికి రాకుండా అడ్డుకుంటున్న పాత యజమాని అనుచరులు

రాల్కో పరిశ్రమ వద్ద

యజమానుల మధ్య వివాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న రాల్కో స్టీల్ పరిశ్రమ వద్ద శుక్రవారం పాత, నూతన యాజమాన్యాల మధ్య వివాదం చోటుచేసుకుంది. రాల్కో పరిశ్రమ పాత యాజమాన్యం బ్యాంకులో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించకపోవడంతో ఎన్‌సిఎల్‌టి స్వాధీనం చేసుకుని వేలం వేసింది. ఆ పరిశ్రమను వేలంలో ఒడిశాకు చెందిన పారిశ్రామికవేత్త రూ.9.60 కోట్లకు దక్కించుకున్నాడు. తనకు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమను వేలం వేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని పాత ఎమ్‌డి రమేష్ కోర్టును ఆశ్రయించారు. దీంతో రిజిస్ట్రేషన్ చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చింది. శుక్రవారం కోర్టు తీర్పు పత్రాలను పట్టుకుని కొంతమంది కిరాయి మనుషులతో ఆయన రాల్కో పరిశ్రమకు చేరుకుని కార్మికులను లోపలకు రాకుండా అడ్డుకున్నాడు. దీంతో పాత, కొత్త ఎమ్‌డిల మధ్య గొడవ చోటుచేసుకుంది. పట్టణ సిఐ సతీష్ కుమార్, ఎస్ఐ రమేష్ పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. రిజిస్ట్రేషన్ చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చింది తప్ప పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలని ఎక్కడా లేదని, దీనిపై కోర్టు తీర్పు ఇస్తే ఆయా పత్రాలతో రావాలని పోలీసులు పాత ఎమ్‌డి రమేష్‌కు సూచించారు. కార్మికులను అడ్డుకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రేమ విఫలమై

యువకుడు ఆత్మహత్య



జనార్దన్ (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరం లోని తోటపాలెం ముచ్చెరువు గట్టు ప్రాంతానికి చెందిన బొండపల్లి జనార్దన్ (21) శుక్రవారం బాలాజీనగర్లఓ నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ చదువుకున్న సమయంలో అమ్మాయిని ప్రేమించిన జనార్దన్ ప్రేమ విఫలమై ఈ దారుణానికి పాల్పడ్డాడు.

ముచ్చెరువు గట్టుకు చెందిన బొండపల్లి కుమార్, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు జనార్దన్ డిగ్రీ చదువుతున్న సమయంలో ఒక అమ్మాయిని ప్రేమించాడు. అయితే ఆ యువతి పెళ్లికి అంగీకరించక పోవడంతో మనస్థాపంతో శుక్రవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలాజీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంపైకి ఎక్కాడు. తన రెండు చేతుల మణికట్టు వద్ద బ్లేడుతో కోసుకొని, అనంతరం భవనంపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే జనార్దన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ రామగణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు శాపంగా యాజమాన్యం తీరు

పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన



కళాశాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు ; కళాశాల గేటుకు అడ్డంకులు పెట్టడంతో గేటు దూకుతున్న విద్యార్థి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పోతనపల్లి వద్ద గల సాయి రంగ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం తీరు విద్యార్థులకు శాపంగా మారింది. రోజురోజుకూ కళాశాలలో వసతులు మృగ్యం కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులకు వంట చేసేందుకు, కళాశాల శుభ్రపరిచేందుకు వాచ్మెన్, ఇతర కూలి పనులు చేసేందుకు వెళ్లిన వారికే కాకుండా కళాశాల సిబ్బందికి, లెక్చరర్స్‌కు కూడా గత కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. ఈనేపథ్యంలో ప్రతినెలా లెక్చరర్‌లు మారిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల రహదారి కోసం తన వద్ద భూమిని తీసుకొని డబ్బులు చెల్లించలేదంటూ ఓ రైతు కళాశాల ప్రధాన గేటుకు తాళం వేసి, అడ్డుగా ట్రాక్టర్ దుక్కుసెట్‌ను పెట్టాడు. దీంతో విద్యార్థులు కళాశాలకు గేటు దూకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గేటుకు తాళం వేసి నెలరోజులైనా యాజమాన్యం పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం కళాశాల వద్ద ధర్నా చేశారు. కళాశాలలో వసతులు మెరుగుపర్చాలని, అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. వెంకటేష్, డి .రాము మాట్లాడుతూ ఈ పాలిటెక్నిక్ కళాశాల అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉందని అన్నారు. కళాశాలకు నేమ్ బోర్డు కూడా పెట్టలేదన్నారు. కళాశాలలో సుమారు 300 నుంచి 400 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి 20 నుండి 30 శాతం కూడా సిలబస్ పూర్తి చేయలేదని, హాస్టల్ సౌకర్యం కోసం వేలాది రూపాయలు ఫీజులు తీసుకొని ఒకే క్యాంపస్‌లో విద్యార్థులకు, విద్యార్థినులకు నిర్వహించడం చట్ట విరుద్ధమని అన్నారు. వారం రోజుల్లోగా యాజమాన్యం ఈ సమస్యలను పరిష్కరించకపోతే పరిష్కారం చూపకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రమేష్, జగదీష్, అను, రత్న, అనిల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే తనిఖీ



రీసర్వేను పరిశీలిస్తున్న జెసి మాధవన్

ప్రజాశక్తి-డెంకాడ

రీసర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తనిఖీ చేశారు. ఆయన డెంకాడ మండలంలో శుక్రవారం పర్యటించారు. పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన మోదవలస పరిధిలోని అల్లుపేటలో నిర్వహిస్తున్న రీసర్వేను పరిశీలించారు. రికార్డులను, మ్యాప్‌లను తనిఖీ చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్‌పై ఆరా తీశారు. రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా గ్రామంలో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తాహసీల్దార్ పద్మావతి, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన కేసుల దర్యాప్తు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎన్.డి.పి.ఎస్, సోషల్ మీడియా కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. శుక్రవారం జూమ్ సమావేశం ద్వారా సమీక్షించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులపై హిస్టరీ షీట్లును ప్రారంభించాలని, వారి కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన గంజాయి కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండేందుకు కారణాలు తెలుసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. దర్యాప్తులో ఉన్న ఎన్‌డిపిఎన్ కేసుల్లో పెండింగులో ఉన్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు, ఫోటోల మార్ఫింగ్కు పాల్పడిన వారిపై నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను కూడా జిల్లా ఎస్పీ సమీక్షించారు. పరారీలో ఉన్న నిందితులపై లుకవుట్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, జి.భవ్యరెడ్డి, డిపిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

విజయనగరంకోట : విజయనగరం మహిళా పోలీసు స్టేషనులో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు నగరంలోని బూర్లిపేటకు చెందిన నారంశెట్టి ఈశ్వరరావు (55)కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు చెప్పారు. బూర్లిపేటకు చెందిన రిక్షా డ్రైవరు నారంశెట్టి ఈశ్వరరావు విధిగా స్కూలు పిల్లలను తన రిక్షాలో స్కూల్ కు తీసుకొని వెళ్ళుతూ, తిరిగి వారిని సాయంత్రం ఇంటికి తీసుకొని వచ్చేవాడు. ఈ క్రమంలో 2024 నవంబర్ 19న ఒక బాలిక(7)ను స్కూలుకు తీసుకొని వెళ్ళి, తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకొని రాకపోవడంతో బాలిక తల్లికి వచ్చిన సమాచారంతో గాజులరేగ పప్పులు మిల్లు వద్ద బాలికను గుర్తించి, రిక్షా డ్రైవరు ఆ బాలికతో అసభ్యరంగా ప్రవర్తించినట్లుగా గుర్తించి, మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ వెల్లడించారు.

కార్మికుల ఉద్యోగ భద్రతపై భరోసా ఏదీ?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్, వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని చెప్పిందని, కానీ ఈ బడ్జెట్‌లో ఆ దిశగా కేటాయింపు లేవనిఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు అన్నారు. కార్మికుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. లక్ష మంది కార్మికులకు పైగా ఉన్న ఆప్కాస్ ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం వారిని పర్మినెంట్ చేయకుండా తిరిగి థర్డ్ పార్టీ విధానం లోకి నెట్టి వేయటాన్ని ఖండించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, థర్డ్ పార్టీ కార్మికులందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపచేసి తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పించే విధంగా బడ్జెట్లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని తెలిపారు.

పిఆర్‌సి అమలుకు కేటాయింపులేవి?

2023 జూలై నుండి అమలు చేయవలసిన 12వ పిఆర్‌సి ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైనది, రాష్ట్ర బడ్జెట్‌లో ఇందుకోసం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ అన్నారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్లో పిఆర్‌సి, ఐఆర్ అమలు, కేటాయింపులపై స్పష్టత లేదని పేర్కొన్నారు. సిపిఎస్/జిపిఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటనా లేదన్నారు. పాఠశాల విద్యకు గత సంవత్సరం 10.15శాతం నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్లో 9.86శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు.

బడ్జెట్‌లో విద్యకు అరకొర నిధులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 9.86శాతం నిధులు మాత్రమే విద్యారంగానికి కేటాయించడమంటే ప్రభుత్వ విద్యారంగం పట్ల ఈ ప్రభుత్వానికి శ్రద్ధ లేదని తెలుస్తోందని ఎపిజెఎసి జిల్లా అధ్యక్షులు కె.వెంకటరమణ పేర్కొన్నారు. గత ఏడాది 10.15శాతం శాతం నిధులు కేటాయించగా ఈ సంవత్సరం విద్యా రంగంలో సంస్కరణలంటూ కొత్తపథకాలు తెచ్చామని చెప్పి 9.86శాతం నిధులు కేటాయించడం అందునా ఉద్యోగ,ఉపాధ్యాయులకు ప్రకటించాల్సిన పిఆర్‌సి, ఐఆర్ గురించి ప్రస్తావించకపోవడం అన్యాయమని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక స్థితిని చక్కదిద్దే బడ్జెట్

ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక స్థితిని చక్కదిద్దేలా, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ఉందని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు బడ్జెట్లో తగిన కేటాయింపులు ఉండడం, మే నుంచి తల్లికి వందనం అమలు చేసేందుకు నిధులు కేటాయించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఏడాదికి రూ.20 వేలు ప్రతి రైతుకు సాయం అందేలా 'అన్నదాత సుఖీభవ' పథకానికి ప్రణాళికలు సిద్ధం చేశారని, అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న పల్లెలు అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు.

భూధార్‌ను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-గజపతినగరం

భూధార్‌ను తక్షణమే రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భూధార్‌ను రద్దు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూధార్ ఆన్‌లైన్ ప్రక్రియలో ఇనాం, దేవాదాయ, పోడు భూముల రైతులను చేర్చకపోవడం అన్యాయమన్నారు. వీరిపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. పాత పద్ధతిలోనే పిఎం కిసాన్, రైతు బీమా, బ్యాంకు రుణాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎస్.బాలరాజు, ఎస్.జానకిరాం, ఎస్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు రాకోటి రాములు, తదితరులు

కొప్పరలో పీడీ పర్యటన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని కొప్పర గ్రామంలో శుక్రవారం ప్రకాశం జిల్లా డిఆర్‌డిఎ పీడీ టి.నారాయణ పర్యటించారు. ఆ గ్రామ మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై, సంఘాల పని తీరు, సభ్యులు చేపట్టిన జీవనోపాధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజులమ్మ సంఘ సభ్యులు లగ్గు మౌనిక ఏర్పాటు చేసిన మాప్ స్టిక్ యూనిట్, డాల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి, ఆదాయం, ఖర్చులపై ఆరాతీశారు. మహిళా సంఘాల పని తీరు, అమలు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమాల గురించి ఎపిడి కె.సావిత్రి వివరించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి, ఎపిఎం టి.మంగమ్మ, తెర్లాం ఎఫ్‌పిఒ ఎపిఎం సీతారాం, స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-వంగర

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వంగర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అరసాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవశం చేసుకున్నారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవణమ్మ, జగదీశ్వరి పాల్గొన్నారు.

మెరకముడిదాం : జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు డి.వెంకటేష్, కె.వెంకటేష్, కె.జనని ఎంపికైనట్లు ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మ శ్రీను తెలిపారు. మండల స్థాయిలో క్విజ్ పోటీలు మెరకముడిదాంలో నిర్వహించారు. అందులో గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి భోగాపురం

గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలని సిఐ ఎన్‌వి ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ముంజేరు గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. వివాదాలకు దూరంగా ఉంటే గ్రామం ప్రశాంతంగా ఉంటుందన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. గ్రామ నాయకులు పిడుగు వెంకట సత్యం, పిడుగు రాంబాబు, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-తెర్లాం

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సిడిపిఒ రాజ్యలక్ష్మి.. కార్యకర్తలను ఆదేశించారు. మండలంలోని పెరుమాళి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ ఉషారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సెక్టార్ సమావేశాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులపై ఆరాతీశారు. ప్రతినెలా గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు.

జిజిహెచ్‌లో సిఐఎస్‌పి సిఐఎస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల ఆదేశాల మేరకు సిఐఎస్‌పి కరికుళం ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామును రెండు రోజులు పాటు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ప్రారంభించిన ఈ కార్యక్రమంలో 30 మంది వైద్య విద్యలో ఉన్న క్లినికల్, నాన్ క్లినికల్ వైద్యులు పాల్గొన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో వైద్య విద్యా బోధన నైపుణ్యాలను సిబిఎంఇ 2019 ఎం ఎంసి గైడ్లైన్స్ ద్వారా మెరుగుపరుచుకున్నారు కోఆర్డినేటర్ డాక్టర్ పిఎ రమణి అధ్యక్షతన వివిధ మోడ్యూల్స్ నిర్వహించారు. డాక్టర్ జి.రాజ్యలక్ష్మి బాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. పాఠశాల ఆవరణ, తాగునీరు, టాయిలెట్లు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్, పాఠశాల రికార్డులు, విద్యార్థులు వర్క్ బుక్స్ పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్‌పి రాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినూత్నం

ఘనంగా సైన్స్ దినోత్సవం



నెల్లిమర్ల డైట్ కళాశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ పగడాలమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నూతన పరిశోధనలను ఆవిష్కరించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కొంగొత్త వైజ్ఞానిక ప్రదర్శనలను రూపొందించి సృజనాత్మకతను చాటారు. నగరంలోని పలు యూనివర్శిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలోజరిగిన కార్యక్రమంలో వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టిమని మాట్లాడాఉ. భారతీయ విజ్ఞాన వ్యవస్థలోని గొప్పదనాన్ని విస్తతంగా ప్రచారం చేయాలని, వ్యవసాయ పద్ధతుల్లో నూతన పోకడలను ఉపయోగించి ఎక్కువ ఫలసాయాన్ని పొందాలని పిలుపునిచ్చారు. తొలుత సర్ సి వి రామన్ చిత్ర పటానికి పూల మాలలను అర్పించారు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు, ముఖ్య అతిథి హైదరాబాద్ గ్లోబల్ రీసెర్స్ డైరెక్టర్ డాక్టర్ అరవింద్ కుమార్, తదితరులు మాట్లాడారు. పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

సత్య కళాశాలలో .. తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా లైఫ్ సైన్సెస్ లేబరేటరిలో రీసెర్చ్ సైంటిస్ట్ గా పని చేస్తున్న డి. ప్రేమసుధాకరం హాజరయ్యారు. సివి రామన్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు సివి రామన్ వంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రేమ సుధాకరం మాట్లాడుతూ విద్యార్థులు ఒకలక్ష్యాన్ని సాధించడానికి సమయాన్ని సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, సైన్స్ అధ్యాపకులు, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో.. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు చేసిన పలు సైన్సు ప్రయోగాలను ప్రదర్శించారు. చైతన్య పాఠశాలల ఆర్ఐ వి.శ్రీనివాసరావు వీటిని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కారక్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దిగి ఉన్న విజ్ఞానాన్ని ప్రదర్శించేందుకు ఇదొక మంచి అవకాశమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ సూర్య చంద్ర, హరికృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, కె.సత్యనారాయణ,ఎం.చిన్నంనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ పాఠశాలలో.. విద్యార్థులు శాస్త్రీయ కోణంలో ఆలోచిస్తూ శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదిగి దేశానికి విశేషమైన సేవలు అందజేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎవి రాజశేఖర్ ఆకాంక్షించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురజాడ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజున పురస్కరించుకొని ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం జెవివి వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పూడి శేఖర్, జెవివి నాయకులు రమేష్, శివాజి, షణ్ముఖరావు, సూర్యనారాయణ, శీరాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో ఆదర్శ పాఠశాల, శ్రీ విక్టరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సోంపురం, వేపాడ, వావిలపాడు. ఎన్‌కెఆర్ పురం, బొద్దాం ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన నమూనాలు, ప్రాజెక్టులు, డాన్సింగ్ బాల్, స్పేస్ శాటిలైట్, పురాతన, ప్రస్తుత కరెన్సీ, వార్తా పత్రికలు ప్రదర్శించారు. క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, శ్రీ విక్టరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ రాఘవ, ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక డైట్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రాజెక్టులను ప్రిన్సిపల్ జి.పగడాలమ్మ పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణరావు, అధ్యాపకులు ఎ.శ్రీనివాస్, పి.రవికుమార్, కె.సూర్యారావు, ఎం.రామకృష్ణ, ఎస్.సుబ్రహ్మణ్యం, వి.భారతి పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ డిఇఒ పి.మోహనరావు సందర్శించారు. మార్చి ఒకటో తేదీన విజయనగరంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ యు.వి.ఎస్.వర్మ, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.అరుణ, ఉపాధ్యాయులు వజ్రపు శ్రీనివాసరావు, ఎస్.కౌశల్య పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేంబ్రిడ్జి పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ధర్మవరంలో సుమారు 90కు పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు, హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కౌముది గ్లోబల్ పాఠశాలలో ప్రిన్సిపల్ శాంతి మహంతి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బొబ్బిలి : పట్టణంలో సైన్స్ దినోత్సవం సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి విద్యా సంస్థలలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. సాయి నగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య విద్యా నికేతన్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రదర్శన ఏర్పాటుచేశారు.

తెర్లాం : పెరుమాళిలోని మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ప్రదర్శనలను ఎంఇఒ త్రినాథరావు పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వెలగవలస, తెర్లాం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.



తెర్లాం.. ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒ త్రినాథరావు



వేపాడ.. ఆదర్శ పాఠశాలలో తయారు చేసిన ప్రదర్శనలతో విద్యార్థులు

నిరంతరం తాగునీటి క్లోరిన్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన క్లోరిన్ పరీక్షలను విరివిగా చేపడుతున్నామనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శుక్రవారం తోటపాలెంలో పంపిణీ జరుగుతున్న కుళాయి నీటి క్లోరిన్ పరీక్షలను ఆయన నిర్వహించారు. కుళాయి నీటిని పరీక్షించగా 0.5 గా నమోదయింది. దీంతో పంపిణీ జరుగుతున్న తాగునీరు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి క్లోరిన్ కలిపిన నీరు పరీక్షించే సమయంలో 0.2 నుండి 2 పార్ట్స్ పర్ మిలియన్ గా నమోదైనట్లయితే అది సురక్షితమైన నీరుగా పరిగణిస్తారు. 0.2 కన్నా తక్కువ ఉన్న 2 కన్నా ఎక్కువగా నమోదు అయినా అది సురక్షితమైన నీరు కానిదిగా భావిస్తారు. అయితే ప్రతిరోజు నగర వ్యాప్తంగా 156 క్లోరిన్ నమూనా పరీక్షలను చేపడుతున్నారు. ఎమినిటీస్ కార్యదర్శులు,క్లోరిన్ ఆపరేటర్స్, ఫిట్టర్లు సంయుక్తంగా ఈ తరహా పరీక్షలను నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి డివిజన్ లో 3 చోట్ల క్లోరిన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ పరీక్షలను 5 చోట్ల చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. నగరంలో 34 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, 2 గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లు మొత్తంగా 36 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ వాటర్ ట్యాంకుల ద్వారా 27 యం.ఎల్.డి నీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగర వ్యాప్తంగా పంపిణీ జరుగుతున్న తాగునీటికి క్లోరిన్ పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరు ఆన్ ఆఫ్ స్విచ్ లను విధిగా వినియోగించుకోవాలని సూచించారు.

పలు ప్రాంతాల్లో పర్యటన

తోట పాలెం, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. డివిజన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గుంతల పూడ్చివేత కార్యక్రమం ఆశాజనకంగా లేదన్నారు. గుంతల నిర్మాణాలు పటిష్టంగా చేయలేదని గుర్తించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి

పరిశుభ్రత ఆధారంగా

హోటళ్లకు స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్

జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత ఆధారంగా హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు, ధర్మశాలలకు స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇస్తామని జిల్లా పర్యాటక శాఖాధికారి కె.కుమారస్వామి చెప్పారు. ఆయా ఆతిథ్య సంస్థలు అవలంభించే నూతన పారిశుధ్య విధానాలు, నిర్వహణ ఆధారంగా ఒన్ లీఫ్, త్రి లీఫ్, ఫైవ్ లీఫ్ రేటింగ్ ఇస్తారని తెలిపారు. స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్ విధానంపై హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిల యజమానులకు స్థానిక మయూర హోటల్‌లో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిటిఒ కుమారస్వామి మాట్లాడుతూ రేటింగ్ ఇచ్చే విధానాలను వివరించారు. ఈ రేటింగ్‌కు ఆయా ఆతిథ్య సంస్థల మెరుగైన, ఆధునిక నిర్వహణా విధానాలనే ప్రాతిపదికగా తీసుకుంటామన్నారు. ఈ రేటింగ్ సాధించేందుకు పాటించాల్సిన నిబంధనలు, కావాల్సిన మౌలిక వసతులు, నిర్వహణ, ఆధునిక సాంకేతికతను అవలంభించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి నిర్వహణ, మానవ వ్యర్థాల నిర్వహణపై దృష్టిపెట్టి ఆధునిక విధానాలను పాటించాలన్నారు. బయో టెక్నాలజిస్ట్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ, మురుగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణకు అవలంబించాల్సిన సాంకేతిక పద్ధతులను వివరించారు. మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ, మురుగునీరు, చెత్తశుద్ధికి పాటించాల్సిన విధానాలను తెలిపారు. కార్యక్రమంలో డిపిఒ టి.వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత, ఇతర అధికారులు, హోటళ్లు, రెస్టారెంట్ల అసోసియేషన్‌ల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ పాయింట్‌లో

పట్టణ కళాసీలకు పని కల్పించాలని నిరసన



లారీలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న కళాసీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

దత్తిరాజేరు మండలం కోమటిపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వే వ్యాగన్ పాయింట్‌లో పట్టణ కళాసీలకు పనులు కల్పించాలని వారు నిరసన చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం గ్రోత్ సెంటర్ వద్ద లారీలను కళాసీలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ బొబ్బిలి రైల్వే స్టేషన్లో ఉన్న వ్యాగన్ పాయింట్‌ను కోమటిపల్లి రైల్వే స్టేషన్‌కు తరలించి పాత కళాసీలకు పనులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాతకళాసీలకు పనులు ఇవ్వాలని ఆందోళన చేస్తే మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన జోక్యంతో సగం పని అప్పగిస్తామని అంగీకరించారని గుర్తుచేశారు. శుక్రవారం వ్యాగన్ లోడింగ్ పనులకు పాత కళాసీలను రావద్దని చెప్పడం అన్యాయమన్నారు. వ్యాగన్ లోడింగ్ పనులతో వేలాది మంది కళాసీ కుటుంబాలు జీవనోపాధి పొందితే, నేడు వారి ఉపాధిపై దెబ్బ కొట్టడం దారుణమన్నారు. రైల్వేస్టేషన్‌కు లారీలు వెళ్లకుండా అడ్డుకోవడంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చర్చలు జరిపారు. పనులు కల్పించే వరకు ఆందోళన చేస్తామని పాత కళాసీలు స్పష్టంచేశారు. కళాసీల ఆందోళనతో గ్రోత్ సెంటర్ రోడ్లపై భారీగా లారీలు నిలిచిపోయాయి.

బడ్డుకొండకు సత్కారం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, పెదతాడివాడ పంచాయతీ గుండాలపేటకు చెందిన బుగత రమణకు వైసిపి జిల్లా కమిటీలో పదవులు లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోపాడలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును వారు సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావును కూడా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపిలో జిల్లా స్థాయి పదవులు లభించినందుకు ఎంతో ఆనందంగా ఉందని, అధినాయకత్వం సూచనల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



కార్యక్రమంలో డెంకాడ సొసైటీ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, నాయకులు కరుమజ్జి త్రినాథరావు, పతివాడ కృష్ణవేణి పెదతాడివాడ ఎంపిటిసి జగన్నాథం, బుగత రామనాయుడు పాల్గొన్నారు.

ముంజేరులో రాళ్ల చెరువు ఆక్రమణ

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామ రెవెన్యూ పరిధిలోని రాళ్లచెరువు ఆక్రమణపై గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. చెరువు గర్భాన్ని సుమారు ఎకరా వరకు ఆక్రమించి శుక్రవారం ఫెన్సింగ్ వేస్తున్నారు. దీనిపై గ్రామస్తులు కొంతమంది వెళ్లి ఆక్రమదారుడిని ప్రశ్నించారు. అనంతరం అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం నేరుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.



చెరువును ఆక్రమించి వేస్తున్న ఫెన్సింగ్

ఎంవిజిఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చింతలవలస వద్ద ఉన్న ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల 27వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఎంవిజిఆర్ యూనిట్ క్యాంపస్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ యూత్, న్యూ లైఫ్ సెంటర్‌తో కలిపి ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎంవిజిఆర్ డైరెక్టర్ పిఎస్ సీతారామరాజు సందర్శించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 92 యూనిట్లు రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎంసి శేఖర్, ప్లేస్మెంట్ డీన్ డాక్టర్ ఎం.సునీల్ ప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్ షణ్ముఖరావు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

కల్వర్టు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని నాయీబ్రాహ్మణ సేవా సంఘ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామికి ఆ సంఘ సభ్యులు వినతులిచ్చారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరపల్లి జయప్రకాశ్, వైస్ సర్పంచ్ పెనగంటి చెల్లయ్య, ఆదిరెడ్డి నాయుడు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘ గౌరవ అధ్యక్షులు తేలకరాపు అప్పారావు, అధ్యక్షులు వడ్డాది శంకర్ రావు, ఉపాధ్యక్షులు ఆర్‌విఎజి ప్రసాద్, కోశాధికారి పట్నాల కృష్ణ ప్రసాద్, తేలకరాపు దేవుళ్లు, మండల కన్వీనర్ తేలకరాపు సుందర్ రావు పాల్గొన్నారు

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తంగుడుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పి.చినప్పలనాయుడు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, మాజీ సర్పంచులు కె.వెంకటరమణ, పి.తిరుపతిరావు, రిటైర్డ్ హెచ్ఎం కె.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇఎస్‌ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఆరోగ్య బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఎస్‌ఐ వైద్యాధికారి ఎమ్‌డి ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక శ్రీఆదిత్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఇఎస్‌ఐ 74వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎస్‌ఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఎ.బేగ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలను వివరించారు. ఆస్పత్రిలో సుమారు 150 రకాల ఖరీదైన మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బిఇ పి.సాయి సంతోష్, ఎంపిహెచ్ జిఎం లావణ్య, డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సూరిబాబు, హెచ్ఎం వి.అమృత పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రేషన్ కార్డుదారులు ఇ-కెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ పి.సుదర్శన రావు కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం కార్డుదారులు కుటుంబ సభ్యులతో కలిసి డిపో డీలర్ ఇ-పాస్ మిషన్ వద్ద ఇ-కెవైసి చేయించుకోవాలని తెలిపారు.